క్లుప్తంగా

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: పోలీస్ శాఖలో పనిచేస్తూ మరణించిన వారికి సంబంధించి ఆయా కుటుంబాలకు సోమవారం ఎస్పీ మణికంఠ ఆర్థిక సాయాన్ని అందచేశారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పెనుమూరులో ఏఎస్‌ఐగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన సూరిబాబు కుటుంబానికి డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును అందచేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్టీఎఫ్ కానిస్టేబుల్ ఓం ప్రకాష్ కుటుంబ సభ్యులకు రూ.30 వేల చెక్కును అందచేశారు. ఎస్పీ వెంట ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి



మొక్క నాటుతున్న పర్సన్ ఇన్‌చార్జ్

గంగాధరనెల్లూరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి కోరారు. సింగిల్ విండో కార్యాలయంలో సోమవారం మహాజన సభ నిర్వహించారు. అనంతరం సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో పలువురు అధికారులు మొక్కలు నాటి, నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను పలుచోట్ల కొట్టేయడంతో వాతావరణంలో పెను మార్పులు సంభవించి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు. ఈ కారణంగా కుటుంబంలో ప్రతి ఒక్కరు ప్రభుత్వ, వ్యవసాయ పొలాల వద్ద విరివిగా మొక్కలు నాటి పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో సీఈవో విజయ్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ బ్రాంచ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ మహేష్, మేనేజర్ విజయ, స్టాఫ్ అసిస్టెంట్ మునస్వామి, కంప్యూటర్ ఆపరేటర్ బాబు పాల్గొన్నారు.

దసరా ఉచిత శిక్షణ

కార్వేటినగరం: ఉపాధ్యాయులకు స్టెప్ ఆధ్వర్యంలో దసరా సెలవుల్లో ఉచితంగా ఇచ్చే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని స్టెప్ చిత్తూరు జిల్లా సమన్వయకర్త జోగి గురుమూర్తి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్‌కు స్టెప్ వారు ఈనెల 4వ తేదీ నుంచి 6 వరకు మూడు రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వ్యక్తిత్వ వికాస మార్గదర్శకులుగా కావడానికి ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడుతాయన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో శ్రీరమణారావు, సావిత్రమ్మ ధ్యాన ఆశ్రమంలో జరిగే శిక్షణా కార్యక్రమానికి ఉపాధ్యాయులు కుటుంబ సమేతంగా హాజరు కావచ్చని చెప్పారు. శిక్షణకు హాజరైన వారికి అన్ని సౌకర్యాలతోపాటు, మెటీరియల్స్, సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు స్టెప్ వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రత్యూష్ 90306 44440, 81432 34555, ధర్మారెడ్డి నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్

పాలసముద్రం: అంగన్‌వాడీ కేంద్రంలో బరువు తక్కువ ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని పాలసముద్రం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అంగన్‌వాడీ టీచర్లతో డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రభుత్వం నిబంధన మేరకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. భోజనానికి ముందు ఉడికిన గుడ్డు ఇవ్వాలని తెలిపారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం చిన్నారులకు చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, రాధ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రేపు మాంసం విక్రయాలు బంద్

పుత్తూరు: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం జంతు వధ చేయరాదని, మాంసం విక్రయాలు జరపరాదని మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమించిన మాంసం వ్యాపారుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

కొత్త పింఛన్లకు స్వస్తి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలవుతోంది. ఇంత వరకు కొత్త పింఛన్ల మంజూరుపై కార్యాచరణ రూపొందించలేదు. అక్టోబర్ 1 నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వం పెద్దలు ఆర్భాటంగా ప్రకటించారు. దీంతో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో అర్హులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్లు ఇవ్వలేదు. అయితే ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేస్తుండడంతో ఇదెక్కడి విడ్డూరమని సర్వత్రా చర్చించుకుంటున్నారు. – శ్రీరంగరాజపురం

- అక్టోబర్ 1 నుంచి కొత్త పింఛన్లు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్
- కొత్త పింఛన్ల కోసం ఎదుచూస్తున్న లబ్ధిదారులు

వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు ప్రతి రోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి ప్రకటనలూ చేయలేదు. ప్రభుత్వ వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో ఇంకా తెలియక ప్రజలు ఆందోళన చెమదుతున్నారు. కొత్తగా వివాహితులైన వారు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు.

గతంలో పక్కాగా పథకాల అమలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి పథకం పక్కాగా అమలయ్యేది. పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే అందించేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగించారు. నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం పింఛన్లు, రేషన్‌కార్డుల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. దీతో కొత్తగా పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇతర పథకాలు ఎప్పుడు ఇస్తారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆగిన వెబ్‌సైట్ కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు దాటినా ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులకు సచివాలయం సిబ్బంది సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు.

పింఛన్లు తొలగించే కుట్ర

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు. ప్రస్తుతం వస్తున్న పింఛన్లను ఎలాగైనా తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. అక్టోబర్‌లో గ్రామ సభలు పెట్టి అనర్హత పేరుతో పింఛన్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం ప్రజలు ఎదురు చూస్తుంటే ఉన్న పింఛన్లు తొలగించడానికి అధికార పార్టీ నాయకులు కుట్రలు చేయడంపై తీవ్ర స్థాయిలో విమర్శలొస్తున్నాయి.

పింఛన్ కోసం ఎదురు చూస్తున్నా...

నాకు ఒక కాలు లేదు. నేను వికలాంగుడిని. సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో ఇచ్చే పింఛన్లు కోసం ఎదురుచూస్తున్నాను. నడవలేని స్థితిలో ఉన్నా.. నాకు ఎవ్వరూ లేరు. పని చేసుకునే పరిస్థితిలో నేను లేను. వికలాంగులకు ఇస్తానన్న పింఛన్ ఇంకా రాలేదు. ఆరోగ్యం బాగా లేదు. ప్రతి వారం మూడు రోజులు ఆసుపత్రికి వెళుతున్నా మందులు తీసుకోవడానికి డబ్బులు లేవు. మాకు ఇస్తామన్న పింఛన్‌ను త్వరగా మంజూరు చేయండి. – ఎం.చిన్నబ్బు, దివ్యాంగుడు, పెద్దతయ్యూరు గ్రామం



అసత్యాలు సృష్టించడం బాబుకే సాధ్యం



జీడీనెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: అసత్యాలను సృష్టించి, వాటిని నిజమని ప్రజలను నమ్మించడం ఈ ప్రపంచంలో సీఎం చంద్రబాబునాయుడికే సాధ్యమని వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జగనన్నను రాజకీయంగా ఎదుర్కోలేక హిందువులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డుపై ఆధారాలు లేకుండా వివాదాలు రేపారన్నారు. రెండో అభిప్రాయం తీసుకోకుండా ఒక సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి పబ్లిక్ మీటింగ్‌లో ఎలా మాట్లాడుతారని సుప్రీంకోర్టు చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు తన స్వార్థ రాజకీయం కోసం ఎంతవరకైనా దిగజారుతారని, తిరుమల లడ్డుపై అసత్య ఆరోపణలే నిదర్శనమన్నారు. ఇకనైనా సీఎం చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని దేవుడిని కోరుతున్నామని తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎస్.విద్యావతి

పాలసముద్రం: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎస్ విద్యావతి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజీవ్ కుమార్, ఇంజినీర్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



విద్యుత్ ఏఈ ఎ.విజయ్‌శేఖర్

శ్రీరంగరాజపురం: మండల విద్యుత్ ఏఈగా ఎ.విజయ్‌శేఖర్ సోమవారం తమ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు విద్యుత్ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి, దుశ్శాలువాలతో సన్మానించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్నా విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలు నాణ్యమైన విద్యుత్ అందించి రైతులకు అందుబాటులో ఉంటానన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



జేసీబీతో ముళ్లపొదల తొలగింపు

వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లెలో స్థానిక సర్పంచ్ శిరీష ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. దిగువ బ్రాహ్మణపల్లె, ఎగువ బ్రాహ్మణపల్లె, కమ్మకండ్రిగ గ్రామాలతో పాటు డంపింగ్ యార్డు వద్ద పరిసరాలను శుభ్రం చేసి ముళ్ల పొదళ్లను తొలగించారు. అనంతరం ఈఓపీఆర్డీ పురుషోత్తం మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చునన్నారు. పంచాయతీలో సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీడీఓ రితేష్, మాజీ సర్పంచ్ చాణిక్యప్రతాప్ ఉన్నారు.

శ్రీఅల్లియల్లమ్మ దసరా కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గుణశేఖర్‌రెడ్డి

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని శ్రీఅల్లియల్లమ్మ తల్లి దేవస్థానం దసరా శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రికలను సోమవారం ఆలయ ధర్మకర్త పార్థసారథిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహకులు గుణశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం అల్లియల్లమ్మ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం, ఆలయ పూజారి విష్ణు స్వామి, యువకులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్కేటింగ్ జట్టుకు పుత్తూరు విద్యార్థి



నిరంజన్‌సాయిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు: గేట్‌పుత్తూరు జడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్.నిరంజన్‌సాయి రాష్ట్ర స్కేటింగ్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కె.జె.వేములు తెలిపారు. సోమవారం నిరంజన్‌సాయిని ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ తిరుపతిలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అండర్–17 విభాగంలో రోడ్ స్కేటింగ్, స్పీడ్ స్కేటింగ్ విభాగాల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకుని రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు వెల్లడించారు. స్కేటింగ్‌లో శిక్షణ ఇచ్చిన పీడీలు జయదేవ్, షంషుద్దీన్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

జీడీనెల్లూరు సీఐగా లక్ష్మీనారాయణ



గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మీనారాయణ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.


చెరకు రైతులకు మద్దతు ధర పెంచాలి

నింద్ర: మండలంలోని చెరకు రైతులకు 2024-25 సంవత్సరానికి జిల్లాలోని ఎస్ఎన్‌జే చక్కెర కర్మాగారంవారు టన్నుకు రూ.3700 మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం నాయకుడు నారాయణ స్వామి రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని చెరకు రైతులకు ఉన్న ఈ ఒక్క ఫ్యాక్టరీ మాత్రమే రైతులకు మద్దతు ధర పెంచాలన్నారు. తమిళనాడులో 3800 రూపాయలు ఇస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం రైతుల సమస్యలు దృష్టిలో ఉంచుకుని చెరకు రైతులకు న్యాయం చేయాలని కోరారు.

పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి సహకారం

నింద్ర: నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నింద్రలో టైరామేర్ టైర్ల కంపెనీని ఆయన సందర్శించారు. విలేకర్ల సమావేశంలో ఆయన మట్లాడుతూ నింద్ర, విజయపురం మండలాల్లో పరిశ్రమలు పెట్టడానికి అన్ని వసతులు ఉన్నాయని, ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఎండీ ఆదర్స్ జలన్, అంబత్తూరు పారిశ్రామిక వేత్త అర్వేల రమేష్ నాయుడు, తహశీల్దార్ శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు దసరా వేడుకలు



అమ్మవారి అవతారాల్లో విద్యార్థులు

కార్వేటినగరం: శ్రీలక్ష్మీనరసింహ విద్యా సంస్థలో ముందస్తు దసరా వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. అనంతరం విద్యాసంస్థ డైరెక్టర్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ విజయ దశమి ప్రత్యేకతను అభివర్ణించారు. ఈ క్రమంలో భాగంగా విద్యా సంస్థ ఆవరణలో నిర్వహించిన నృత్య పోటీల్లో అమ్మవారి అవతారంలో విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటేష్, ధనుంజయరెడ్డి, పురుషోత్తం, హెచ్‌ఎం కృష్ణవేణి, కిషోర్, నిర్మల, చందుప్రియ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నమోదు చేయాలి



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: మండలంలోని వీఓఏలు తమ రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఐకేపీ ఏపీఎం ఫరిద్ మస్తాన్ తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్‌పీ, సీసీఎఫ్, స్త్రీనిధి రికవరీ, ఆరోగ్యపోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫరీద్‌మస్తాన్ మాట్లాడుతూ స్త్రీనిధి ద్వారా ఇప్పుడు 10 మంది సభ్యులకు రూ.5 లక్షలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి అప్పులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తామన్నారు. ఏ రకమైన అప్పు తీసుకున్నా 100 శాతం రికవరీ చేయాలన్నారు. డ్వాక్రా గ్రూపులకు, సిబ్బందికి రికార్డుల నిర్వహణపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, మంజుల, బాలయ్య, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

నేడు డైట్‌లో సంగీత సాహిత్య గేయధార

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో మంగళవారం సంగీత సాహిత్య గేయధార, సారంగపాణి పద పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో సంగీత సాహితీ చంద్ర అవార్డు గ్రహీత డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర, సారంగపాణి పద పరిచయ కర్త రాయలసీమ అధ్యక్షుడు భూమన్ సంగీత సాహిత్య గేయధారకు ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నారని పేర్కొన్నారు. అలాగే శతావధాన చక్రవర్తి ఆముదాల మురళీ, ప్రముఖులు కుసుమకుమారి, మద్దూరి ఆదిత్యశర్మ, శోభారాజు, డాక్టర్ పి.రామలక్ష్మి కూడా పాల్గొంటారని తెలిపారు. డైట్ కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గాయత్రి సేవలు ఎనలేనివి



ఏఈ గాయత్రిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

గంగాధరనెల్లూరు: గ్రామీణ నీటిపారుదుల శాఖ ఏఈ గాయత్రి సేవలు మరువలేనివని, ప్రభుత్వ అధికారులు విధులలో సక్రమంగా మెలిగితే సన్మానాలు సహజమని మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మునిరాజారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా విధులు నిర్వహిస్తూ వెదురుకుప్పంకు బదిలీపై వచ్చిన గాయత్రిని గంగాధరనెల్లూరులో పలువురు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఏఈ గాయత్రి గత ప్రభుత్వంలో జగనన్న హౌసింగ్ కాలనీల ఏర్పాటు, నీళ్ల బోర్ల విషయంలో, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు మేలు కలిగించేలా చర్యలు చేపట్టారన్నారు. ఈ సందర్భంగా నూతనంగా విధుల్లో చేరిన ఈశ్వర్‌ను సైతం సన్మానించారు.

ప్రపంచంలోనే తృతీయ భాష హిందీ



బహుమతులు అందజేస్తున్న వాణిశ్రీ

పుత్తూరు: ప్రపంచవ్యాప్తంగా ప్రజలు మాట్లాడే భాషల్లో హిందీ తృతీయ స్థానంలో ఉందని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య తెలిపారు. సోమవారం కళాశాలలో హిందీ భాషా పక్షోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ హిందీ భారతదేశ అధికార భాష అని తెలిపారు. విభిన్న భాషలు, సంస్కృతుల సమూహమే భారత దేశ ఔన్నత్యమని అన్నారు. హిందీ భాషా పక్షోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం, నృత్యం, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వి.వీరయ్య, హిందీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ, అధ్యాపకులు ఎం.నరసింహులు, పి.వెంకటేశన్, కె.శ్రీదేవి, ఎం.శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రమదానంతో చెత్తకుప్పల తొలగింపు



పోలిస్ స్టేషన్‌లో శ్రమదానం

నగరి: ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమం 22వ వార్షికోత్సవం, అధ్యక్షుడు మేల్‌మరువత్తూరు సిద్ధలపీఠం గురువు అడిగళార్ కుమారుడు జీబీ అన్బల గన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఉద్యమ నేతలు శ్రమదానం చేశారు. సోమవారం సుమారు 500 మందితో కూడిన ఈ బృందం మెగా సర్వీస్ క్యాంప్ నిర్వహించింది. నగరి దేశమ్మ దేవాలయం, నగరి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉన్న చెత్తకుప్పలను తొలగించి, ప్రజాసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు మానవసేవే మాధవసేవ అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఉద్యమ రాష్ట్ర కార్యదర్శి వీటీ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నేతలు గోవిందస్వామి, ఈశ్వర్, టీసీ కృష్ణ, మోహన్, కమలాకర్, ఎల్లప్పరెడ్డి , షణ్ముఖ రెడ్డి, రాజేష్, బాలాజీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ఘన జీవామృతం తయారీ

పాలసముద్రం: ప్రకృతి వవసాయంపై రైతులు దృష్టి సారించాలని నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. సోమవారం క్రిష్ణజమ్మపురం యూనిట్‌లోని గ్రామ సంఘ అధ్యక్షురాలు కోశాధికారి మునియమ్మ, కవిత, లత ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రినర్ ప్రతాప్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో విత్తనం నుంచి విత్తడం వరకు ద్రవ, ఘన జీవామృతం, కషాయాలతో పండించే విధానంపై అవగాహన కల్పించారు. సంఘ సభ్యులు కిచెన్ గార్డెన్‌పై వివరించారు. మిత్రశత్రు పురుగులపై అవగాహన అవగాహన కల్పించారు.

అరుణగిరిపై అభిషేక పూజలు



వెదురుకుప్పం: డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

కొత్త చెరువు కబ్జాపై ఫిర్యాదు



వెదురుకుప్పం: మాంబేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్–35లో ఉన్న కొత్త చెరువును గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేసినట్లు సోమవారం వెదురుకుప్పం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న చెరువును ఆక్రమించుకున్నా పట్టించుకునే వారు లేరని తెలిపారు. చెరువును కబ్జా చేసి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తహశీల్దార్ రమేష్ బాబుకు విన్నవించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ కొరత

- మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం
- పన్ను వసూలుకు సభ్యులంతా సహకరించాలి
- మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పీజీ నీలమేఘం

నగరి: మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ కొరత ఉందని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆయన ఈ విషయం తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ ఆదేశానుసారం అజెండాను మున్సిపల్ అధికారులు కౌన్సిల్‌కు చదివి వినిపించారు. అంజెండాలో పేర్కొన్న అంశాలపై అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. దీనిపై వైస్‌చైర్మన్ వెంకటరత్నం మాట్లాడుతూ అజెండాలో పొందుపరిచే అంశాలను ముందస్తుగా పాలకవర్గ సభ్యులకు తెలపాలన్నారు. దీనిపై కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ అజెండాలోని అంశాలను కౌన్సిల్‌కు ముందస్తుగా తెలియజేస్తామన్నారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ వర్షాకాలం కనుక ప్రతి వార్డులోనూ పారిశుధ్యం, వీధి దీపాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ సమస్యలపై ఆరాతీసి పరిష్కరిస్తామన్నారు. ప్రతివార్డులోనూ కేటాయించే పనులు చేపట్టడానికి సభ్యులు ముందుకు రావాలని మున్సిపల్ చైర్మన్ కోరగా దీనిపై సభ్యులు మాట్లాడుతూ తమకు మున్సిపాలిటీలోని నిధుల వివరాలు అందించాలని నిధులు లేకుండా పనులు ఎలా చేయాలని ప్రశ్నించారు. ప్రస్తుతం మున్సిపల్ పన్నుల వసూలు వేగం పెరిగిందని చైర్మన్ తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ జనరల్ ఫండ్ కొరత ఉందని సభ్యులందరూ పన్నుల వసూలుకు సహకారం అందించాలన్నారు. తాము సహకారం అందిస్తామని అయితే నీటి కనెక్షన్ లేకున్నా కొందరికి నీటి పన్ను వేశారని, వాటిని పరిశీలించి తొలగించాలని సభ్యులు తెలిపారు. అలాంటి సమస్య లేకుండా చూస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, సీడీపీవో కృష్ణవేణి, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.